సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
మంగళవారం । 12 । డిసెంబర్ । 2023



కిలో టమాట రూ.16

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో సోమవారం కిలో టమాట గరిష్ఠంగా రూ.16, కనిష్ఠంగా రూ.7, సరాసరిన రూ.10 ప్రకారం ధర పలికింది.



కోళ్లపెంట కింద గోవా మద్యం

మద్యం అక్రమ రవాణాలో కొందరు ఆరితేరిపోయారు. కోళ్లపెంట కింద గోవా మద్యాన్ని ఉంచి తీసుకువస్తూ పోలీసులకు దొరికారు.

8లో

గరిష్ఠం/కనిష్ఠం
33.2°/18.5°

సోమవారం జిల్లా పరిధిలో ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఉదయం వేళ చలి తీవ్రత పెరిగింది. గంటకు 6 నుంచి 8 కిలోమీటర్ల వేగంతో ఆగ్నేయం దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

బాధ్యతగా విధులు నిర్వర్తించాలి



అనంతపురం కలెక్టర్ గౌతమికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎంపీడీఓ కవిరాజు

అనంతపురం అర్బన్: బాధ్యతగా విధులు నిర్వర్తించాలని ఎంపీడీఓగా నియమితులైన కవిరాజుకు కలెక్టర్ గౌతమి సూచించారు. అనంతపురం జిల్లాలో 11 ఏళ్లు సెకండరీ గ్రేడ్ టీచర్‌గా పనిచేసిన కవిరాజు ఈ ఏడాది గ్రూప్–1లో అర్హత సాధించారు. శ్రీసత్యసాయి జిల్లా ఎంపీడీఓగా నియమితులయ్యారు. ఈ నేపథ్యంలో ఆయన సోమవారం అనంతపురం కలెక్టర్ గౌతమి, జాయింట్ కలెక్టర్, ఇన్‌చార్జ్ జెడ్పీ సీఈఓ కేతన్‌గార్గ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రజలతో మమేకమై విమర్శలకు తావివ్వకుండా బాధ్యతగా పనిచేసి మన్ననలు పొందాలని కలెక్టర్ నూతన ఎంపీడీఓకు సూచించారు.

'ఆడుదాం ఆంధ్రా'ను విజయవంతం చేయాలి



శిక్షణలో మాట్లాడుతున్న డీఎస్‌డీఓ ఉదయ్ భాస్కర్

పుట్టపర్తి అర్బన్: గ్రామీణ క్రీడాకారుల ప్రతిభను వెలికి తీసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ఆడుదాం ఆంధ్రా'ను విజయవంతం చేసేందుకు అధికారులంతా కృషి చేయాలని జిల్లా క్రీడాభివృద్ధి శాఖ అధికారి (డీఎస్‌డీఓ) ఉదయ్ భాస్కర్ కోరారు. సోమవారం పుట్టపర్తి ఎంపీడీఓ కార్యాలయంలో జిల్లాలోని సచివాలయ డిజిటల్ అసిస్టెంట్లు, వలంటీర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయ్ భాస్కర్ మాట్లాడుతూ... 'ఆడుదాం ఆంధ్రా' కార్యక్రమానికి విశేష స్పందన లభించిందన్నారు. రిజిస్ట్రేషన్లకు బుధవారం చివరి రోజు కాగా, ఇప్పటికే 1,42,171 మంది పేర్లు నమోదు చేసుకున్నారని, దీంతో శ్రీసత్యసాయి జిల్లా రాష్ట్రంలోనే 5వ స్థానంలో నిలిచిందన్నారు. రిజిస్ట్రేషన్లకు మరో రెండు రోజులు గడువు ఉండటంతో మరింత పెరిగే అవకాశం ఉందన్నారు. 'ఆడుదాం ఆంధ్రా' కార్యక్రమంలో భాగంగా క్రికెట్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించడానికి ప్రతి సచివాలయం నుంచి డిజిటల్ అసిస్టెంట్, ఇద్దరు వలంటీర్లను ఎంపిక చేసి శిక్షణ ఇస్తామన్నారు. అనుమానాల నివృత్తికి రెండు సచివాలయాలకు ఒక పీడీని నియమించినట్లు వెల్లడించారు. రిజిస్ట్రేషన్ల ఆధారంగా జిల్లాను 5 గ్రూపులుగా విభజించామని, వీటి నిర్వహణ బాధ్యతలు సచివాలయ స్థాయిలో డిజిటల్ అసిస్టెంట్, వలంటీర్లదేనన్నారు.

కనుమ దారిలో దొంగల కలకలం..!



చిలమత్తూరు: మండల పరిధిలోని కనుమ లక్ష్మీ నరసింహస్వామి ఆలయ సమీపంలో దారి దోపిడీ దొంగల సంచారం కలకలం సృష్టిస్తోంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. చిలమత్తూరులోని ఓ జనరల్ స్టోర్‌లో యగ్నిశెట్టిపల్లి గ్రామానికి చెందిన మంజునాథ్ అనే యువకుడు పనిచేస్తున్నాడు. పని ముగించుకుని ఆదివారం రాత్రి బైక్‌పై స్వగ్రామం బయలుదేరాడు. కనుమ సమీపంలోకి రాగానే నలుగురు వ్యక్తులు రోడ్డుకు అడ్డుగా వచ్చి బైక్‌ను ఆపారు. డబ్బు డిమాండ్ చేసి దాడికి యత్నించగా... యువకుడు వారి నుంచి తప్పించుకుని అటవీ ప్రాంతంలోకి వెళ్లి దాక్కున్నాడు. అనంతరం తన యజమానికి ఫోన్ ద్వారా సమాచారం ఇవ్వడంతో అతను స్నేహితులతో కలిసి కనుమ వద్దకు చేరుకున్నాడు. అనంతరం యువకుడికి ధైర్యం చెప్పి ఇంటికి పంపించాడు. కాగా బైక్‌ను ఆపిన వ్యక్తులు దారి దోపిడీ దొంగలా... లేక వేరే ఇతర కారణాలతో యువకుడిని అడ్డుకున్నారా అన్నది తెలియరాలేదు. ఈ ఘటనపై ఎస్‌ఐ గంగాధర్‌ను వివరణ కోరగా తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు. అయినా ఘటనపై విచారణ చేస్తామన్నారు.

గీత దాటితే మోతే



☛ ఈనెల 10వ తేదీన లేపాక్షి మండల పరిధిలో జూదం ఆడుతున్న 21 మందిని డీఎస్పీ కంజాక్షన్ ఆధ్వర్యంలో సీఐ వేణుగోపాల్, ఎస్‌ఐ గోపి అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.3 లక్షల నగదు, 25 ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నారు.



☛ ఈనెల 8వ తేదీన చిలమత్తూరు మండలం కొడికొండ వద్ద కర్ణాటక మద్యం తరలిస్తున్న ఇద్దరిని ఎస్‌ఐ గంగాధర్ సిబ్బందితో కలిసి అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 34 బాక్సుల కర్ణాటక మద్యం స్వాధీనం చేసుకుని కారును సీజ్ చేశారు.



☛ ఈనెల 8న తాడిమర్రి మండలం ఏకపాదంపల్లి వద్ద రేషన్ బియ్యాన్ని కర్ణాటకకు తరలిస్తున్న బొలెరో వాహనాన్ని ఎస్‌ఐ నాగస్వామి పట్టుకున్నారు. 50 బస్తాలను స్వాధీనం చేసుకోవడంతో పాటు వాహనాన్ని సీజ్ చేశారు. నిందితులపై కేసు నమోదు చేశారు.

- దూకుడు పెంచిన పోలీసులు
- సరిహద్దులో పటిష్ట బందోబస్తు
- కర్ణాటక మద్యంపై ఉక్కుపాదం
- ఎక్కడికక్కడ అరెస్టులు.. కేసులు
- సరిహద్దు మండలాల్లో హైఅలర్ట్

సాక్షి, పుట్టపర్తి

కర్ణాటక మద్యం అక్రమ రవాణా, రేషన్ బియ్యం తరలింపు, గుట్కా, మట్కా, గంజాయిపై పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. జిల్లాలో 16 మండలాలకు కర్ణాటక సరిహద్దుగా ఉండగా, ఆయా మండలాల పరిధిలో నిఘా మరింత పెంచారు. కర్ణాటక మద్యం రాష్ట్రంలోకి ప్రవేశించిన వెంటనే పక్కా సమాచారంతో దాడులు చేసి పట్టుకుంటున్నారు. వెంటనే కేసులు నమోదు చేసి వాహనాలను సీజ్ చేస్తున్నారు. ముఖ్యంగా చిలమత్తూరు మండలం కొడికొండ వద్ద ఉన్న చెక్‌పోస్టు వద్ద అనుమానం వచ్చిన ప్రతి వాహనాన్నీ నిలిపి తనిఖీ చేస్తున్నారు. ఈ క్రమంలోనే మద్యం అక్రమంగా తీసుకొస్తున్న వాహనాలు పట్టుబడుతున్నాయి. అయితే మద్యం, ఇసుక, రేషన్ బియ్యం తదితర కేసులను పట్టుకోవాల్సిన సెబ్, టాస్క్‌ఫోర్స్ సిబ్బంది మాత్రం చేష్టలుడిగి చూస్తున్నారు.

రోజూ కాన్ఫరెన్స్.. ప్రతి నెలా సమీక్ష..

జిల్లా ఎస్పీ ఎస్వీ మాధవ్‌రెడ్డి రోజూ ఉదయం అన్ని స్టేషన్ల పోలీస్ అధికారులతో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్నారు. ప్రతి ఒక్కరితో కర్ణాటక మద్యం, రేషన్ బియ్యం తరలింపు గురించి చర్చిస్తున్నారు. ఎక్కడా పొరపాట్లు జరగరాదని హెచ్చరిస్తున్నారు. అంతేకాకుండా ప్రతి నెలా.. జిల్లాలో జరిగిన.. రిజిష్టర్ అయిన నేరాలపై సమీక్షిస్తున్నారు. అవకతవకలు జరిగినట్లు తేలితే.. నిర్దాక్షిణ్యంగా చర్యలు తీసుకుంటామని వార్నింగ్ ఇస్తున్నారు. ఈ క్రమంలో కొందరు సిబ్బందిపై కూడా వేటు వేశారు. మరి కొందరికి స్థానచలనం కల్పించారు. దీంతో పోలీసులు మరింత అప్రమత్తమయ్యారు.

సరిహద్దుతోనే సమస్య..

జిల్లాలో మొత్తం 32 మండలాలున్నాయి. ఇందులో 16 మండలాలకు కర్ణాటక సరిహద్దు ఉంది. ఆయా మండల కేంద్రాలకు సుదూర ప్రాంతాల్లో పోలీసులు రాత్రింబవళ్లు నిఘా ఏర్పాటు చేశారు. పక్కా సమాచారంతో దాడులు చేసి కర్ణాటక మద్యం అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపుతున్నారు. అంతేకాకుండా జిల్లా నుంచి రేషన్ బియ్యం సరిహద్దు దాటకముందే పట్టేస్తున్నారు. జూదగాళ్లపై ప్రత్యేక బృందాలతో దాడి చేయిస్తున్నారు. అందువల్లే నిత్యం ఏదో ఒక మండలంలో కర్ణాటక మద్యం, జూదగాళ్లు పట్టుబడుతున్నారు. పెనుకొండ, హిందూపురం, కదిరి, పుట్టపర్తి సబ్ డివిజన్ పరిధిలో పోలీసులు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంటూ మద్యం, ఇసుక, రేషన్ బియ్యం తరలింపును ఎక్కడికక్కడ కట్టడి చేస్తున్నారు.

కనిపించని సెబ్, టాస్క్‌ఫోర్స్..

కర్ణాటక మద్యం, ఇసుక, రేషన్ బియ్యం అక్రమ రవాణా, మట్కా, గుట్కా, గేమింగ్‌పై చర్యలు తీసుకోవాల్సిన సెబ్ (స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో), టాస్క్‌ఫోర్స్ ఎక్కడా కనిపించడం లేదు. జిల్లాలో 8 (చెన్నేకొత్తపల్లి, పెనుకొండ, మడకశిర, హిందూపురం, పుట్టపర్తి, ధర్మవరం, కదిరి, తనకల్లు) సెబ్ స్టేషన్లతో పాటు రెండు (తూమకుంట, కొడికొండ) చెక్ పోస్టులు ఉన్నాయి. కేసుల నమోదు విషయంలో వీరు ఎక్కడా తమ మార్కు చూపించడం లేదు. ఇక ప్రత్యేకంగా నియమించిన టాస్క్‌ఫోర్స్ బృందం జిల్లాలో పనిచేస్తున్నట్లు ప్రజలకు కూడా తెలియని పరిస్థితి నెలకొంది.

సమాచారమిస్తే చర్యలు



జిల్లా సరిహద్దులో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశాం. కర్ణాటక మద్యం, రేషన్ బియ్యం తరలిస్తూ పట్టుబడితే కేసులు నమోదు చేస్తున్నాం. కేసుల నమోదు విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదు. ప్రజలు కూడా ఎక్కడైనా కర్ణాటక మద్యం విక్రయిస్తున్నట్లు తెలిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలి. వారి పేర్లు గోప్యంగా ఉంచుతాం. అక్రమార్కులకు పోలీసులు సహకరించినా చర్యలు తీసుకుంటాం. ఏ స్థాయి అధికారిపై ఫిర్యాదు అందినా తప్పకుండా విచారించి చర్యలకు సిఫారసు చేస్తాం.

– ఎస్వీ మాధవ్‌రెడ్డి, ఎస్పీ

రెండు నెలల్లో నగర వనం ప్రారంభిస్తాం

- రూ.2 కోట్లతో పనులు చేపడుతున్నాం
- అటవీశాఖ ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ మధుసూదన్‌రెడ్డి



నగర వనం పనులను పరిశీలిస్తున్న అటవీశాఖ ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ మధుసూదన్‌రెడ్డి

పెనుకొండ రూరల్: రెండు నెలల్లో పనులు పూర్తి చేసి నగర వనాన్ని ప్రజలకు అందుబాటులోకి తెస్తామని అటవీశాఖ ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ మధుసూదన్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఉదయం ఆయన ఎన్‌హెచ్ 44 సమీపంలో పులేకమ్మ దేవాలయం ఎదురుగా రూ.2 కోట్లతో 50 హెక్టార్లలో నిర్మిస్తున్న నగర వనాన్ని పరిశీలించారు. పనుల్లో నాణ్యత పాటించాలని అధికారులకు సూచించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. నగర వనంలో జిమ్, యోగా, వాకింగ్ ట్రాక్ నిర్మిస్తున్నామన్నారు. పెనుకొండ వాసులతో పాటు జాతీయ రహదారి వెంట వారు కూడా ఇక్కడ కాసేపు సేదదీరేలా సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. కోటపై కూడా నగరవనాన్ని నిర్మించేందుకు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ప్రతిపాదనలు పంపినట్లు ఆయన వెల్లడించారు. వేసవిలో అగ్నిప్రమాదాల నుంచి అడవులను కాపాడేందుకు అటవీ ప్రాంతానికి తగు చర్యలు చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో జిల్లా అటవీ శాఖ అధికారులు రవీంద్రారెడ్డి, సందీప్ కృపాకర్, చంద్రశేఖర్, ఆనంద్, శ్రీనివాస్‌రెడ్డి తదితర పాల్గొన్నారు.



అటవీ ప్రాంతాన్ని మ్యాపు ద్వారా పరిశీలిస్తున్న దృశ్యం

జూనియర్ లాయర్లకు న్యాయం

- వైఎస్సార్ లా నేస్తం నిధులు విడుదల
- జిల్లాలోని 37 మందికి రూ.10,65,000 లబ్ధి



న్యాయవాదికి ఆర్థిక సాయం పత్రాన్ని అందజేస్తున్న అధికారులు

పుట్టపర్తి అర్బన్: జూనియర్ న్యాయవాదులు వృత్తిలో నిలదొక్కుకునే వరకూ ఆర్థికంగా అండగా నిలిచే 'వైఎస్సార్ లా నేస్తం' పథకం 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన రెండో విడత నిధులు విడుదలయ్యాయి. సోమవారం తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయం నుంచి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కంప్యూటర్‌లో బటన్‌నొక్కి లబ్ధిదారుల ఖాతాల్లో నిధులు జమ చేశారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో గ్రామ/వార్డు సచివాలయాల జిల్లా నోడల్ అధికారి శివారెడ్డి, పంచాయతీ రాజ్ ఎస్ఈ గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా అర్హులైన న్యాయవాదులకు మంజూరైన ఆర్థిక సాయం పత్రాలను అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ...యువ న్యాయవాదులు వృత్తిలో నిలదొక్కుకునేందుకు 'వైఎస్సార్ లా నేస్తం' పథకం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. జిల్లా అర్హులైన 37 మంది యువ న్యాయవాదులకు ఈ ఏడాది రెండవ విడతలో ఒక్కొక్కరికి రూ.5 వేల చొప్పున రూ.10,65,000 ఖాతాల్లో జమ అయ్యాయన్నారు. న్యాయవాదుల సంక్షేమానికి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందన్నారు. 'వైఎస్సార్ లా నేస్తం' పథకం దేశవ్యాప్తంగా అమలు చేయాలని ఇటీవల పార్లమెంటులో సైతం చర్చ జరిగిందన్నారు. దీనిబట్టి చూస్తే ఈ పథకం ఎంత ప్రయోజనమైనదో అర్థం చేసుకోవచ్చన్నారు. వైఎస్సార్ లా నేస్తం ద్వారా కొత్తగా చేరిన లాయర్లకు నెలకు రూ.5 వేల చొప్పున ఏడాదికి రూ.60 వేలు... మూడేళ్లకు రూ.1,80,000 ఆర్థిక సాయాన్ని పొందుతారన్నారు. అర్హులందరూ ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రస్తుతం జూలై 2023 నుంచి డిసెంబర్ 2023 వరకూ ఆరు నెలల కాలానికి ఒక్కొక్కరికి రూ.30 వేల చొప్పున మంజూరైనట్లు వెల్లడించారు. ప్రభుత్వ ప్రోత్సాహాన్ని సద్వినియోగం చేసుకుని వృద్ధిలోకి రావాలని, వీలైనంత వరకూ పేదలకు ఉచితంగా న్యాయసేవలు అందించేందుకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో యువ న్యాయవాదులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

సీఎం ప్రోత్సాహం మరువలేనిది



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 'వైఎస్సార్ లా నేస్తం' ద్వారా నాలాంటి ఎందరో జూనియర్ లాయర్లకు అండగా నిలుస్తున్నారు. మూడేళ్లకు రూ.1.80 లక్షలు ఇవ్వడం మామూలు విషయం కాదు. ఏ ప్రభుత్వమూ ఇంత వరకూ ఇలాంటి పథకం ప్రవేశ పెట్టలేదు. మేమంతా ఎప్పటికీ సీఎం జగన్‌కు రుణపడి ఉంటాం.

– నాగార్జున, ఎనుములపల్లి

అర్జీలకు తక్షణ పరిష్కారం చూపాలి



అర్జీలను స్వీకరిస్తున్న డీఆర్‌ఓ కొండయ్య

పుట్టపర్తి అర్బన్: స్పందన కార్యక్రమంలో అందే అర్జీలకు తక్షణ పరిష్కారం చూపాలని డీఆర్‌ఓ కొండయ్య అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన డీపీఓ విజయ్‌కుమార్, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, సీపీఓ విజయ్‌కుమార్, సచివాలయాల జిల్లా నోడల్ ఆఫీసర్ శివారెడ్డితో కలిసి కలెక్టరేట్‌లో నిర్వహించిన 'స్పందన' కార్యక్రమంలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. వివిధ సమస్యలపై మొత్తం 278 అర్జీలు అందగా, వాటి పరిష్కారం కోసం ఆయా శాఖలకు పంపారు. అనంతరం డీఆర్‌ఓ కొండయ్య మాట్లాడుతూ, స్పందన కార్యక్రమంలో వచ్చిన ప్రతి అర్జీకీ న్యాయం చేయాలన్నారు. అర్జీలకు న్యాయమైన పరిష్కారం చూపాలంటే ప్రతి అధికారీ క్షేత్రస్థాయికి వెళ్లాలన్నారు. ఇరు వర్గాలను కలిసి చర్చించి పరిష్కారం చూపాలన్నారు. ఒకసారి సమస్య పరిష్కారం కాకపోతే, మళ్లీ జిల్లా కేంద్రం వరకూ వచ్చేందుకు అర్జీదారులు తీవ్ర ఇబ్బందులు పడతారని, దీన్ని అర్థం చేసుకుని అధికారులు మానవత్వంతో సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి సుబ్బారావు, జిల్లా ఉద్యాన శాఖ అధికారి చంద్రశేఖర్, ఐసీడీఎస్ పీడీ లక్ష్మీకుమారి, బీసీ, ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖ అధికారులు నిర్మలాజ్యోతి, శివరంగ ప్రసాద్, మోహన్‌రాం తదితరులు పాల్గొన్నారు.

స్పందన అర్జీల్లో కొన్ని...

- అమడగూరు మండలం మహమ్మదాబాద్ రెవెన్యూ పొలంలోని సర్వే నంబర్ 269లో తమకు ఏడు ఎకరాల భూమి ఉందని పుట్టగోసులపల్లి చెందిన సుట్టింటి అంజినప్ప, నాగరాజు, ఆంజనేయులు, చిన్నప్ప తదితరులు డీఆర్‌ఓకు తెలిపారు. అయితే పక్క సర్వే నంబర్‌లో పొలం ఉన్న పెద్ద ముసలప్ప, చిన్న ముసలప్పలు తమ సర్వే నంబర్ వేసి గ్రామానికే చెందిన గొర్ల గంగులప్ప, లక్ష్మీనారాయణ, మాసే గంగులప్ప అనే రైతులకు విక్రయించారన్నారు. ప్రస్తుతం పెద్ద ముసలప్ప, చిన్న ముసలప్ప చని పోయారని, వెంటనే దాన్ని రద్దు చేసి న్యాయం చేయాలని డీఆర్‌ఓను కోరారు.
- తనకు ధర్మవరం మండలం రేగాటిపల్లిలోని సర్వే నంబర్ 437లో 2.60 ఎకరాలుండగా, ప్రభుత్వం తీసుకుందని మాలమ్మ డీఆర్‌ఓకు తెలిపారు. అయితే ఇప్పటి వరకూ పరిహారం అందలేదని తనకు న్యాయం చేయాలని కోరారు.
- అగళి మండలం కొమరపల్లిలోని సర్వే నంబర్ 43–9లోని 1.22 ఎకరాలకు 1–బీ మంజూరు చేయాలని గ్రామానికి చెందిన ముద్దప్ప విన్నవించారు.
- తనకు ప్రభుత్వం ఇల్లు మంజూరు చేయగా, నిర్మాణం చేపట్టి పూర్తి చేశానని, అయితే ఇంతవరకూ బిల్లు రాలేదని పరిగికి చెందిన సుగుణ డీఆర్‌ఓకు తెలిపారు. అధికారులను అడుగుతుంటే సాంకేతిక సమస్య అని చెబుతున్నారని, బిల్లు వెంటనే మంజూరయ్యేలా చూడాలని వినతి పత్రం అందజేశారు.



పరిగి బీరప్ప ఆలయంలో శివలింగాకారంలో ప్రమిదలు వెలిగించి పూజలు చేస్తున్న దృశ్యం



బత్తలపల్లి మండలం ఓంకారేశ్వర ఆలయంలో జ్వాలాతోరణం వద్ద భక్తుల సందడి



హిందూపురం త్యాగరాజనగర్ శివాలయంలో దీపాలు వెలిగిస్తున్న మహిళలు



హిందూపురం మేళాపురం శివాలయంలో శమీవృక్షం వద్ద దీపాల వెలుగులు

హరహర మహాదేవ

కార్తీకంలో వచ్చిన చివరి సోమవారం జిల్లాలోని శైవ ఆలయాలన్నీ ఓంకార నాదంతో ప్రతిధ్వనించాయి. ఉదయమే భక్తులు భారీగా తరలిరాగా శివాలయాలు పోటెత్తాయి. సాయంత్రం వేళ మహిళలు కార్తీక దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు.

– సాక్షి నెట్‌వర్క్

నిలకడగా మల్లేష్ ఆరోగ్యం

అనంతపురం మెడికల్: ఆత్మహత్యాయత్నం చేసి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విడపనకల్లు మండలం పాల్తూరు ఎంపీపీ స్కూల్ ఉపాధ్యాయుడు మల్లేష్ ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వరరావు తెలిపారు. సోమవారం ఆయన 'సాక్షి'తో మాట్లాడుతూ.. మల్లేష్‌కు మెరుగైన వైద్య సేవలందిస్తున్నట్లు వెల్లడించారు. ప్రస్తుతానికి ఎలాంటి ఇబ్బంది లేదన్నారు.

క్లుప్తంగా

'పోలీసు స్పందన'కు 40 వినతులు



వినతులు స్వీకరిస్తున్న ఎస్పీ మాధవరెడ్డి

పుట్టపర్తి టౌన్: జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి వివిధ సమస్యలపై 40 వినతులు అందాయి. ఎస్పీ మాధవరెడ్డి స్వయంగా వినతులు స్వీకరించి, బాధితులతో మాట్లాడారు. సమస్యలకు తక్షణ పరిష్కారం చూపాలని సంబంధిత స్టేషన్ హౌస్ ఆఫీసర్లను ఆదేశించారు. కార్యక్రమంలో దిశ డీఎస్పీ వరప్రసాద్, సీఐ సతీష్, లీగల్ అడ్వైజర్ సాయినాథరెడ్డి పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి



రాజశేఖర్ (ఫైల్)

సోమందేపల్లి: మండలంలోని ముద్దపుకుంటలో విద్యుత్ షాక్‌కు గురై రాజశేఖర్ (24) మృతి చెందాడు. సోమవారం సాయంత్రం ఈ ఘటన చోటు చేసుకుంది. గ్రామ సమీపంలోని ఓ రైతు పొలంలో ట్రాన్స్‌ఫార్మర్‌కు ఫ్యూజ్ వేసేందుకు ప్రయత్నిస్తుండగా షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి తండ్రి నాగరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

ఆర్టీసీ మెకానిక్ మృతి



గోపాల్ (ఫైల్)

తలుపుల: కదిరి ఆర్టీసీ డిపోలో పంప్ మెకానిక్‌గా పనిచేస్తున్న తలుపులలోని ప్రకాష్‌నగర్‌కు చెందిన టి.గోపాల్ (45) అనారోగ్యంతో బాధపడుతూ ఆదివారం రాత్రి మృతి చెందాడు. విషయం తెలుసుకున్న డీఎం మైనుద్దీన్, ఎంఎఫ్ రామకృష్ణ, ఈయూ సభ్యులు సోమవారం గోపాల్ మృతదేహాన్ని సందర్శించి, నివాళులర్పించారు. తక్షణ సాయంగా రూ.15 వేలు అందజేశారు. మృతుడికి భార్య, ఓ కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

శ్రమజీవుల అడ్డా



ఆటోనగర్‌లో లారీకి బాడీ బిల్డింగ్ చేస్తున్న కార్మికులు



ఐచర్ వాహనానికి బాడీ బిల్డింగ్ చేస్తున్న వెల్డర్

- జీవనోపాధి కేంద్రంగా హిందూపురంలోని ఆటోనగర్
- కష్టించి పనిచేసే వారికి ఏదో ఒక ఉపాధి

హిందూపురం: కష్టించి పనిచేయడం నైజంగా కలిగిన వారి ఆర్థికాభివృద్ధికి హిందూపురంలోని ఆటోనగర్ కల్పతరువుగా మారింది. శ్రమనే నమ్ముకున్న అసంఘటిత రంగ కార్మికులకు ఇక్కడ మెరుగైన ఉపాధి దొరుకుతోంది. వందలాది మంది కార్మికుల చేతుల్లో మరమ్మతులకు లోనైన సైకిల్ మొదలు.. భారీ వాహనాల వరకూ అన్నీ సరికొత్తగా రూపుదిద్దుకుంటున్నాయి.

వందకు పైగా వర్క్‌షాప్‌లు..

హిందూపురం శివారులోని ఆటోనగర్‌లో దాదాపు వందకు పైగా వివిధ రకాల మెకానిక్ షాపులున్నాయి. వీటన్నింటిలో 2వేలకు పైగా కార్మికులు పనిచేస్తున్నారు. ఎక్కువగా ఆటోలు, కార్లు, టిప్పర్లు, లారీలు, బస్సుల పనులు ఉంటాయి. లేత్‌వర్క్, లైనర్, ఆర్క్ వెల్డింగ్, గ్యాస్ వెల్డింగ్, పెయింటింగ్, బాడీబిల్డర్ (బస్సులు, లారీలు, కార్లు), బ్యాటరీ తయారీ తదితర అంశాల్లో నిష్ణాతులైన వారు ఉండడంతో హిందూపురం వాసులే కాకుండా మడకశిర, పెనుకొండ, కర్ణాటకలోని బాగేపల్లి తదితర ప్రాంతాల నుంచి పలువురు ఇక్కడకు వచ్చి తమ వాహనాలకు మరమ్మతు చేయిస్తుంటారు. ఏ పని లభ్యం కాక ఇబ్బందిపడేవారు ఒక్కసారి ఆటోనగర్‌ను ఆశ్రయిస్తే ఏదోక పని దొరుకుతుంది. ఇక్కడ హెల్పర్ మెకానిక్, దిన, వారం కూలితో ఉపాధి పొందుతూ కార్మికులుగా ఎదిగిన కొందరు ఏకంగా మెకానిక్ షాపులనే ఏర్పాటు చేసుకున్నారు. ప్రభుత్వం ఆర్థిక సహాయాన్ని అందిస్తే మరింత అభివృద్ధి చెందుతామని అంటున్నారు. తమలాంటి కార్మికులకు మరింత మేలు జరగడమే కాకుండా ఎంతోమందికి జీవనోపాధి దొరుకుతుందంటున్నారు.

మరింత అభివృద్ధి చేయాలి



ఇక్కడ స్వయం శక్తిని నమ్ముకుని జీవిస్తున్న వారే ఎక్కువ మంది ఉన్నారు. ప్రభుత్వం ఆర్థిక సాయం అందిస్తే ఎంతో బాగుంటుంది. ఈ ప్రాంతాన్ని మరింత అభివృద్ధి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

– అంజాద్, ఆటోనగర్ ప్రెసిడెంట్, హిందూపురం

గుర్తింపు కల్పించాలి



ఏళ్ల తరబడిగా ఆటోనగర్‌లో వాహనాల మరమ్మతుల పనులతో జీవనం సాగిస్తున్నాం. ఇక్కడ నిష్ణాతులైన మెకానిక్‌లుండడంతో కర్ణాటక నుంచి కూడా పెద్ద సంఖ్యలో వాహనాలను యజమానులు తీసుకొచ్చి మరమ్మతులు చేయించుకుంటున్నారు. ఇక్కడ వాహనాలకు సంబంధించి చేయని పని అంటూ లేదు. ప్రభుత్వం కార్మికులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలి.

– అక్రం, మెకానిక్, హిందూపురం

వివాహిత అదృశ్యం



మల్లెల రేణుక(ఫైల్)

కదిరి టౌన్: పుట్టింటికి వచ్చిన ఓ వివాహిత అదృశ్యమైంది. పట్టణ సీఐ నారాయణరెడ్డి తెలిపిన వివరాల మేరకు..మండలంలోని కదిరికుంట్లపల్లికి చెందిన ఎం.శ్రీరాములు భార్య మల్లెల రేణుక 15 రోజుల క్రితం కదిరి ఇందిరా కాలనీలోని తన పుట్టినింటికి వచ్చింది. ఆదివారం ఆమె ఇంట్లోంచి వెళ్లిపోయింది. రాత్రయినా తిరిగి రాకపోవడంతో ఆందోళన చెందిన కుటుంబీకులు సమీప ప్రాంతాల్లో, బంధువుల వద్ద వాకబు చేశారు. అయినా ఫలితం లేకపోవడంతో భర్త శ్రీరాములుకు తెలపగా, సోమవారం అతను పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేయనున్నట్లు సీఐ నారాయణరెడ్డి తెలిపారు.

కోడిపెంట కింద గోవా మద్యం

అనంతపురం క్రైం: కోడి పెంట కింద మద్యం బాటిళ్లు దాచి అక్రమంగా గోవా నుంచి అనంతకు తరలిస్తున్న ముఠా గుట్టు రట్టయింది. ఈ కేసులో మొత్తం ఆరుగురిని సెబ్ పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలను డీపీఓలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సెబ్ ఏఎస్పీ రామకృష్ణ వెల్లడించారు. బత్తలపల్లి మండలంలోని ఈదుల ముష్టూరు నివాసి మాలపాటి రవితేజ, ధర్మవరం కేతిరెడ్డి కాలనీకి చెందిన షాహిద్ ఖాన్, అనంతపురం నగరం కేతిరెడ్డి కాలనీకి చెందిన లోచర్ల హరికృష్ణ, పుట్లూరు మండలం చింతరపల్లి గ్రామానికి చెందిన పుట్లూరు రామాంజినేయరెడ్డి, శింగనమల మండలం కొరివిపల్లి నివాసి దూదేకుల కుళ్లాయిస్వామి ((ప్రస్తుతం తాడిపత్రి టైలర్స్ కాలనీలో నివాసం), తాడిపత్రిలోని రెడ్డివారిపల్లి వీధికి చెందిన చన్నా జయచంద్ర ప్రతాప్ బృందంగా ఏర్పడి రెండు నెలల క్రితం ఒక సెకండ్ హ్యాండిల్ ఐచర్ వాహనాన్ని కొనుగోలు చేసి, గోవా నుంచి ఫుల్‌బాటిళ్ల మద్యం అక్రమ రవాణా చేపట్టారు. ఈ క్రమంలో మద్యం అక్రమ రవాణాపై నిఘా ఉంచిన సెబ్ ఏఎస్పీ రామకృష్ణ, అర్బన్ డీఎస్పీ ప్రసాదరెడ్డి పర్యవేక్షణలో వన్‌టౌన్ సీఐ రెడ్డప్ప, ఎస్ఐ సుధాకర యాదవ్, సిబ్బంది బృందాలుగా విడిపోయి సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు అనంతపురంలోని చెరువు కట్ట వద్ద పటిష్ట తనిఖీలు చేపట్టారు. అటుగా వచ్చిన కారులో ప్రయాణిస్తున్న వారి ప్రవర్తన అనుమానాస్పదంగా కనిపించడంతో ఆరా తీశారు. దీంతో మద్యం అక్రమ రవాణా వెలుగు చూసింది. అదే సమయంలో అటుగా వచ్చిన ఐచర్ వాహనాన్ని ఆపి తనిఖీ చేయగా కోడిపెంట కింద దాచిన 262 ఫుల్ బాటిళ్ల మద్యం బయటపడింది. ఐచర్‌తో పాటు కారును సీజ్ చేసి, రూ.35,050 నగదు స్వాధీనం చేసుకున్నారు. ఆరుగురు నిందితులను అరెస్ట్ చేశారు.

నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ

లేపాక్షి: నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్స్, ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు ల్యాండ్ సర్వేయర్, ఎలక్ట్రీషియన్, ప్లంబింగ్ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇస్తున్నారు. అభ్యర్థులకు 18 నుంచి 25 ఏళ్లలోపు వయస్సు ఉండాలని, ల్యాండ్ సర్వేయర్ శిక్షణకు ఇంటర్, ఎలక్ట్రీషియన్ కోర్సుకు 10 తరగతి పూర్తిచేసిన వారు అర్హులని హిందూపురం ఇన్‌స్టిట్యూట్ అసిస్టెంట్ డైరెక్టర్ గోవిందరాజులు తెలిపారు. ఈమేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఆసక్తి కల్గిన వారు ఈనెల 13వ తేదీలోపు ఆధార్, రేషన్‌కార్డు జిరాక్స్‌లు, అర్హత పత్రాలు, పాస్‌పోర్టు సైజ్ ఫొటోలతో హిందూపురం ముక్కడిపేటలోని ఎన్ఏసీ స్కిల్ డెవలప్‌మెంట్ హబ్ సెంటర్లో సంప్రదించాలని సూచించారు. పూర్తి వివరాలకు 9052901657, 9110550779 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

జనవాక్కు

ఇంటి వద్దకే సేవలు



గతంలో ఏ పని కావాలన్నా దూరంగా ఉన్న ప్రభుత్వ కార్యాలయానికి వెళ్లాల్సి వచ్చేది. చివరకు పింఛన్ డబ్బు కోసం కూడా నడుచుకుంటూ ఆఫీస్ వద్దకెళ్లి తెచ్చుకునేవాళ్లం. సీఎంగా వైఎస్ జగన్ వచ్చిన తర్వాత మా ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు అందుతున్నాయి. ప్రతి నెలా 1వ తేదీనే వలంటీర్ ఇంటి వద్దకే వచ్చి పింఛన్ డబ్బు ఇస్తున్నాడు. చివరకు మాకు అవసరమైన కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు సైతం పైసా ఖర్చు లేకుండా ఇంటి వద్దనే తెచ్చిచ్చారు. ఇంటి వద్దకే డాక్టర్ వచ్చి వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు ఇచ్చారు. ఇంత గొప్ప పాలన ఎన్నడూ చూడలేదు. మరో పది కాలాల పాటు ముఖ్యమంత్రిగా వైఎస్ జగనే ఉండాలని కోరుకుంటున్నా.

– రుక్మిణమ్మ, హిందూపురం

రూ.2.48 లక్షలకు పైగా లబ్ధి



వైఎస్ జగన్ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత గతంలో ఎన్నడూ లేనంతగా వివిధ సంక్షేమ పథకాల ద్వారా నా కుటుంబానికి రూ.2,48,273 లక్షలకు పైగా లబ్ధి చేకూరింది. వైఎస్సార్ చేయూత కింద రూ.37,500, ఆసరా ద్వారా రూ.10,786, వసతి దీవెన కింద రూ.15,825, పింఛన్ కానుక కింద రూ.,1,08,000, రైతు భరోసా ద్వారా రూ.40,500, విద్యాదీవెనతో రూ.31,381, సున్నా వడ్డీ (డ్వాక్రా) రూ.4,281 చొప్పున మొత్తం నగదు రూపంలో మా బ్యాంక్ ఖాతాల్లోకి ప్రభుత్వమే జమ చేసింది. కేవలం అర్హతే ప్రామాణికంగా మాకు సంక్షేమ పథకాలు వర్తింపజేసిన వైఎస్ జగన్ మరో పది కాలాల పాటు సీఎంగా ఉండాలి.

– లక్ష్మీనరసప్ప, కోరేసంగనహళ్లి, మడకశిర మండలం

ఇంటి వద్దనే పింఛన్ ఇస్తున్నారు



ముసలోళ్లమనే కనికరం కూడా లేకుండా గత ప్రభుత్వం మమ్మల్ని నానా ఇబ్బందులు పెట్టింది. పింఛన్ కోసం పంచాయతీ ఆఫీస్ వద్దకు నడుచుకుంటూ వెళ్లి వచ్చేవాళ్లం. అక్కడ ఆఫీసర్ లేకపోతే గంటల తరబడి వేచి చూడాల్సి వచ్చేది. అప్పట్లో ప్రతి నెలా ఇబ్బంది పడ్డాం. వైఎస్ జగన్ ముఖ్యమంత్రి అయిన తర్వాత ప్రతి నెలా 1వ తేదీనే ఇంటి వద్దకే వలంటీర్ వచ్చి పింఛన్ డబ్బు ఇస్తున్నాడు. కరోనా సమయంలో తిండిగింజలు కూడా తెచ్చిచ్చారు. సీఎం వైఎస్ జగన్ మేలు ఎన్నటికీ మరువలేం.

– సంజీవమ్మ, సి.కొడిగేపల్లి, మడకశిర మండలం

టాటా ఏస్ బోల్తా

చిలమత్తూరు: మండలంలోని కొడికొండ చెక్‌పోస్టులో రక్షా అకాడమీకి ఎదురుగా టాటాఏస్ వాహనం బోల్తా పడింది. సోమవారం తెల్లవారుజామున హైదరాబాద్‌లో డయాలసిస్‌కు సంబంధించిన మందులు తీసుకెళ్లి తిరుగు ప్రయాణంలో రక్షా అకాడెమీ వద్దకు చేరుకోగానే సైడ్ పిల్లర్‌ను ఢీకొనడంతో వాహనం బోల్తా పడింది. ఈ ఘటనలో డ్రైవర్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు.

విద్యుత్ షాక్‌తో యువకుడి మృతి

చెన్నేకొత్తపల్లి: విద్యుత్ షాక్‌తో ఓ యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... చెన్నేకొత్తపల్లి మండలం ముష్టికోవెల నివాసి మల్లికార్జున నూతన గృహ నిర్మాణం చేపట్టాడు. నిర్మాణంలో భాగంగా రొద్దం మండలం కోగిర గ్రామానికి చెందిన నాగార్జున (23) సోమవారం సెంట్రింగ్ పనుల్లో నిమగ్నమయ్యాడు. ఆ సమయంలో కట్టడంపైనున్న విద్యుత్ తీగలు ప్రమాదవశాత్తు తగలడంతో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ శ్రీధర్ తెలిపారు.

న్యాయవాదులకు అండగా ప్రభుత్వం



మాట్లాడుతున్న భాస్కరరెడ్డి

సోమందేపల్లి: 'వైఎస్సార్ లా నేస్తం' ద్వారా జూనియర్ న్యాయవాదులకు ప్రతి ఏటా రూ.5వేలు ఆర్థిక సాయం అందిస్తూ జగన్ ప్రభుత్వం అండగా నిలిచిందని వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి భాస్కరరెడ్డి అన్నారు. సోమవారం లా నేస్తం నిధుల విడుదలైన నేపథ్యంలో సోమందేపల్లిలోని యువ న్యాయవాదులతో కలసి ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రూ.100 కోట్లతో న్యాయవాదుల సంక్షేమ నిధిని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. గతంలో ఏ ప్రభుత్వమూ న్యాయవాదుల సంక్షేమానికి కృషి చేయలేదన్నారు.

'ఎన్‌ఎల్‌యూ' ప్రవేశ పరీక్షల్లో 'వినూత్న' ప్రతిభ

- ఏపీ జనరల్ కేటగిరిలో రెండు, ఉమెన్ కేటగిరిలో ప్రథమస్థానం
- దేశ స్థాయి జనరల్ కేటగిరీలో 470వ ర్యాంకు



వినూత్న

అనంతపురం ఎడ్యుకేషన్: నేషనల్ లా యూనివర్సిటీల (ఎన్ఎల్‌యూ) ప్రవేశ పరీక్షలో అనంతపురానికి చెందిన కాపు వినూత్న జాతీయ స్థాయిలో సత్తా చాటింది. లక్ష మందికి పైగా పోటీ పడిన ఈ పరీక్షలో దేశ స్థాయి జనరల్ విభాగంలో 470వ ర్యాంక్ సాధించింది. జనరల్ కేటగిరీలో మొత్తం 1,504 ఖాళీలను భర్తీ చేయనున్నారు. అలాగే ఆంధ్రప్రదేశ్ జనరల్ కేటగిరీలో 30 ఖాళీలను భర్తీ చేయనుండగా వినూత్నకు రెండో ర్యాంకు దక్కింది. ఏపీ ఉమెన్ కేటగిరీలో 22 ఖాళీలను భర్తీ చేయనుండగా వినూత్న మొదటి స్థానంలో నిలిచింది. ఈ నెల 3న నేషనల్ లా యూనివర్సిటీ ప్రవేశ పరీక్ష జరిగింది. ఫలితాలు ఆదివారం రాత్రి విడుదలయ్యాయి. వినూత్న తండ్రి కాపు విజయచంద్రారెడ్డి గతంలో డీసీసీబీ సీఈఓగా పని చేశారు. ప్రస్తుతం డిప్యూటేషన్‌పై ఏపీ సీఓబీ సీఐటీలో ఫ్యాకల్టీగా పని చేస్తున్నారు. తల్లి కాపు మధురిమ గృహిణి.

విద్యార్థిని ఆత్మహత్యాయత్నం

చిలమత్తూరు: మండల కేంద్రంలోని కేజీబీవీలో పదో తరగతి విద్యార్థిని సోమవారం ఉదయం ఆత్మహత్యాయత్నం చేసింది. రోజువారీ రాత పరీక్షల్లో భాగంగా సోమవారం నిర్వహించిన పరీక్షలో సదరు విద్యార్థిని కాపీ కొట్టిందని ఒకేషనల్ ఉపాధ్యాయురాలు ప్రమీలకు సహ విద్యార్థులు ఫిర్యాదు చేశారు. దీంతో ఆమెను నోట్‌బుక్కులు ఆఫీస్ రూంలో పెట్టి రావాలని ఉపాధ్యాయురాలు ఆదేశించారు. ఈ అంశాన్ని అవమానకరంగా భావించిన ఆమె నేరుగా పై అంతస్తులో ఉన్న బాత్‌రూంలోకి వెళ్లి విషపూరిత ద్రావకం తాగింది. గమనించిన ఉపాధ్యాయులు వెంటనే ఆమెను స్థానిక పీహెచ్‌సీకి తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స అనంతరం వైద్యుల సూచన మేరకు హిందూపురంలోని ప్రభుత్వాస్పత్రికి 108 అంబులెన్స్‌లో తరలించారు. ప్రాణాపాయం లేదని వైద్యులు తెలిపారు. ఘటనపై పోలీసులు ఆరా తీశారు. ఎస్ఓ రెహానా మాట్లాడుతూ.. చాలా సున్నిత మనస్తత్వం కలిగిన సదరు విద్యార్థి కాపీ కొట్టిందని తెలిసినా ఎవరూ ఏమీ అనలేదన్నారు. పాఠశాలలో అందరూ స్నేహభావంతోనే మెలుగుతారని తెలిపారు. విషయం తెలుసుకున్న ఎంపీపీ పురుషోత్తమరెడ్డి కేజీబీవీ ఎస్ఓకు ఫోన్ చేసి ఆరా తీశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూసుకోవాలని కోరారు.

వరుడిపై కేసు నమోదు

కదిరి టౌన్: వధువును మోసం చేసిన వరుడిపై పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు... కదిరి మున్సిపల్ పరిధిలోని కుటాగుళ్లలో నివాసముంటున్న యువతితో అనంతపురంలోని ఆదర్శనగర్‌కు చెందిన రెడ్డప్ప కుమారుడు శ్రీకాంత్‌కు గత నెల 28న పెద్ద సమక్షంలో వివాహ నిశ్చితార్థం జరిగింది. పరస్పరం ఉంగరాలు మార్చుకున్న అనంతరం వీరి వివాహాన్ని ఈ నెల 15న చేయాలని ఇరువైపులా పెద్దలు నిర్ణయించారు. ఈ క్రమంలో తనకు ఈ పెళ్లి ఇష్టం లేదని వరుడు శ్రీకాంత్ మొండికేశాడు. బలవంతంగా పెళ్లి చేస్తే ఆమెను చంపేస్తానని బెదిరింపులకు దిగాడు. దీంతో పెళ్లి పేరుతో తమను మోసగించిన శ్రీకాంత్‌పై చర్యలు తీసుకోవాలంటూ వధువు తల్లిదండ్రులు సోమవారం ఉదయం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో శ్రీకాంత్‌పై చీటింగ్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు సీఐ నారాయణరెడ్డి తెలిపారు.

ఆకట్టుకున్న కళాఉత్సవ్



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో డైట్ ప్రిన్సిపాల్ రామకృష్ణ

పుట్టపర్తి: బుక్కపట్నంలోని ఉపాధ్యాయ శిక్షణ సంస్థ(డైట్)లో సోమవారం నిర్వహించిన కళాఉత్సవ్ పోటీలు ఆకట్టుకున్నాయి. ఉమ్మడి జిల్లా నుంచి 9, 10, 11, 12 తరగతుల విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మొత్తం 27 అంశాల్లో జరిగిన పోటీల్లో ప్రథమ స్థానాల్లో నిలిచిన విద్యార్థులను 14, 15వ తేదీల్లో విజయవాడలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. పోటీలను డైట్ ప్రిన్సిపాల్ రామకృష్ణ పర్యవేక్షించగా, న్యాయ నిర్ణేతలుగా ఉమ్మడి జిల్లా పీఈటీల అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు లోసారి నాగరాజు, పీడీ భాస్కర్‌రెడ్డి, ఉపాధ్యాయురాలు లక్ష్మి వ్యవహరించారు.